క్లుప్తంగా

ఘనంగా అయ్యప్ప పడిపూజ



పూజలు చేస్తున్న భక్తులు

కడ్తాల్: అయ్యప్పస్వామి మహాపడిపూజ, ఇరుముడి ధారణ పూజలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగాయి. మండల పరిధి మైసిగండి శివాలయంలో శనివారం వైస్ ఎంపీపీ మాజీ సభ్యుడు ఆనంద్‌స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా అయ్యప్ప భక్తులు ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. ఈ సందర్భంగా గురుస్వాముల ఆధ్వర్యంలో స్వాములకు ఇరుముడి ధారణ చేయించగా, భక్తులు శబరిమలకు వెళ్లారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, శేఖర్‌గౌడ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు వెంకటేశ్, మహేశ్‌గౌడ్, కిరణ్, వినోద్, అశోక్, పాండు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పలకల పంపిణీ



విద్యార్థులకు పలకలు అందజేస్తున్న దాత

తలకొండపల్లి: మండల పరిధి గట్టుఇప్పలపల్లిలో అంగన్‌వాడీ చిన్నారులకు పలకలు పంపిణీ చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ శివాజీ శాఖ ఘటనాయక్ కావలి రమేష్.. శనివారం విద్యార్థులకు పలకలు అందజేశారు. కార్యక్రమంలో రమేష్, చంద్రశేఖర్, పవన్, భాస్కర్, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడి సన్నిధిలో డీసీసీబీ డైరెక్టర్



స్వామివారి సన్నిధిలో వెంకటేశ్ తదితరులు

ఆమనగల్లు: మహబూబ్‌నగర్ జిల్లాలోని కురుమూర్తి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని శనివారం డీసీసీబీ డైరెక్టర్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్ గుప్తా సందర్శించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్‌కుమార్, ఈఓ మోహన్‌రెడ్డిలు వెంకటేశ్‌కు స్వాగతం పలికారు. నాయకులు మురళీ, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్‌గౌడ్ ఉన్నారు.

కార్తీకమాసం ముగింపు సందడి



పూజాకార్యక్రమంలో భక్తులు

ఆమనగల్లు: కార్తీకమాసం ముగింపు సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణ సమీపంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పరమేశ్‌గౌడ్, ఆంజనేయులు యాదవ్, రాజు, రవీందర్, రామచంద్రయ్య, మల్లేశ్, తిరుపతి, నర్సింహ, శ్రీశైలం, విజయ్, మహేశ్, నారాయణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కుమార్ పాల్గొన్నారు.

వరాహాల.. స్వైరవిహారం



శ్రీరామ్‌నగర్‌లో పందుల సంచారం

తుర్కయంజాల్: నివాసాల మధ్య పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. వాటిని తరలించేందుకు పుర అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో గుంపులుగా సంచరిస్తూ.. స్థానికులకు అసౌకర్యం కలిగిస్తున్నాయి. పురపాలక సంఘం పరిధి 24 వార్డుల్లో వరాహాలు దర్శనమిస్తున్నాయి. గతంలో ఈ సమస్యను పరిష్కరించేందుకు సర్వే నంబర్ 52లో కొంత భూమిని కేటాయించి, అక్కడికి తరలించారు. అయినా సమస్య ఎప్పటి లాగే ఉందని స్థానికులు తెలిపారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పందుల పెంపకం దారులతో చర్చించి, వాటిని తరలించాలని కోరుతున్నారు. ఇదే విషయమై శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌ను వివరణ కోరగా, పందుల పెంపకం దారులకు పలుమార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ.. స్పందించడం లేదని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

రైతు శ్రేయస్సే కాంగ్రెస్ లక్ష్యం



కడ్తాల్: రైతు పండుగకు తరలిన నాయకులు

- వ్యవసాయ రంగానికి పెద్దపీట
- సంక్రాంతి నుంచి రూ.7500 సాగుసాయం
- కాంగ్రెస్ నాయకులు
- రైతు పండుగకు తరలిన పార్టీ శ్రేణులు

కడ్తాల్: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తికావస్తున్న సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా శనివారం మహబూబ్‌నగర్ జిల్లా బూత్‌పూర్‌లో నిర్వహించిన రైతు పండుగకు మండల పరిధి నుంచి రైతులు, పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లగా.. ఆయన జెండా ఊపి వాహన ర్యాలీని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏడాది కాలంలోనే వ్యవసాయ రంగానికి రూ.54,280 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.18 వేల కోట్లతో 22 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేశారని తెలిపారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నారని వెల్లడించారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు పెద్ద మొత్తంలో నిధులు వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే సంక్రాంతి నుంచి రైతు భరోసా కింద ఎకరాకు రూ.7500 సాయం ప్రభుత్వం అందించనుందని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, నాయకులు వెంకటేశ్, లక్ష్మయ్య, మల్లయ్య, శ్రీను, రమేశ్, జహంగీర్ అలీ, జహంగీర్ బాబా, శ్రీను, కాంగ్రెస్ యూత్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు పాల్గొన్నారు.

తలకొండపల్లి నుంచి..

తలకొండపల్లి: మహబూబ్‌నగర్ రైతు పండుగకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, రైతులు భారీగా తరలి వెళ్లారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో బయలుదేరగా.. ప్రభాకర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి సర్కార్ రైతు సంక్షేమాభివృద్ధికి అధిక ప్రాధాన్యతిస్తుందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు.

మాడ్గులలో..

మాడ్గుల: మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించిన రైతు పండుగకు ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ చెర్మన్ బట్టు కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, రైతులు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వాహన శ్రేణిని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు సాయి రెడ్డి, రాములు, జంగయ్య, సంపత్, నర్సింహ్మా, రమేష్, రైతులు పాల్గొన్నారు.



తలకొండపల్లి: జెండా ఊపి బస్‌లను ప్రారంభిస్తున్న ప్రభాకర్‌రెడ్డి



మాడ్గులలో..

కాంగ్రెస్ అంటేనే రైతుకు భరోసా

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: కాంగ్రెస్ ప్రభుత్వ పాలన రైతన్నలకు పండుగని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రైతులు ఆర్థికంగా బలపడేందుకు ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని చెప్పారు. రైతు పండుగ నేపథ్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అంటేనే రైతులకు భరోసా అని అభివర్ణించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గతంలో వైఎస్సార్ ముఖ్యమంత్రిగా రైతులకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేశారని, ప్రస్తుతం రేవంత్‌రెడ్డి రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. దేశ చరిత్రలో రైతులకు ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత తమదేనని, వచ్చే ఏడాది రైతుభరోసా కింద ఎకరాకు రూ.7500 అందించనున్నామని స్పష్టంచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలన అందిస్తుంటే ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య తదితరులు పాల్గొన్నారు.



యాత్ర బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

పట్టుదలతో విద్యనభ్యసించాలి

ఉన్నతస్థాయికి ఎదగాలి: జడ్జి



మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు

ఇబ్రహీంపట్నం: పట్టుదల, క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నతస్థాయికి ఎదగాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శంకర్ శ్రీదేవి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి హిమబిందులు అన్నారు. బాల్య వివాహ ముక్త భారత్ పిలుపు మేరకు లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం ఇబ్రహీంపట్నంలోని సాంఘిక సంక్షేమ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో వారు మాట్లాడారు. విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాలు చట్ట వ్యతిరేకమని, అలాంటి వాటిని ప్రొత్సహించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అంజన్‌కుమార్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ మెర్సీ వరూధిని పాల్గొన్నారు.

బాల మల్లేశ్ మృతి తీరని లోటు

యాచారం: సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల మల్లేశ్ మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ యాచారం మండల కార్యదర్శి మస్కు సంజీవ అన్నారు. శనివారం మల్లేశ్ గుండెపోటుతో మృతి చెందగా.. చింతుల్ల గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శిగా పనిచేసిన సమయంలో పేదల సమస్యలపై రాజీలేని పోరాటం చేసిన ఘనత ఆయనకే దక్కిందని పేర్కొన్నారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేశారని గుర్తుచేశారు.

హామీల అమలులో సర్కార్ విఫలం

- ఉచిత ప్రయాణం తప్ప.. చేసిందేమీ లేదు
- ప్రజా సమస్యలు పట్టించుకోని ప్రభుత్వాలు
- సామాన్యుల హక్కులు హరిస్తున్న కేంద్రం
- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ



మహాసభలో మాట్లాడుతున్న జాన్ వెస్లీ తదితరులు

మంచాల: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్ వెస్లీ ఆరోపించారు. మండల పరిధి లోయపల్లి గ్రామంలో నిర్వహించిన సీపీఎం 9వ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలను గాలికి వదిలేసిందని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తప్ప చేసింది ఏమీ లేదని విమర్శించారు. మూసి ప్రక్షాళన పేరుతో గందరగోళం సృష్టించడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, దీంతో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని ప్రకటించి చేతులు దులుపుకొంటుందని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ.. కార్మిక, కర్షక వ్యతిరేక చట్టాలను అమలు చేస్తుందని మండిపడ్డారు. సామాన్య ప్రజల హక్కులను హరించే విధంగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. బూర్జువా పార్టీలు అధికారంలోకి రాగానే బడుగు, బలహీన వర్గాల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. నల్లా చట్టాలను అమలు చేసి, రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా కుట్రలు చేస్తుందని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీలు అధికారంలోకి వస్తేనే పేదోడికి సరైనా న్యాయం దక్కుతుందని స్పష్టంచేశారు. ప్రజలు వాస్తవాలను పరిశీలించి, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న కమ్యూనిస్టులను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి భాస్కర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పగుడాల యాదయ్య, నాయకులు కె.శ్రీనివాస్‌రెడ్డి, శ్యాం సుందర్, రావుల జంగయ్య, మార బుగ్గ రాములు, సామేల్, జగదీష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయోత్సవాలను జయప్రదం చేయండి

చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ



సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్

తుర్కయంజాల్: ప్రజాపాలన విజయోత్సవాలను జయప్రదం చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ కోరారు. శనివారం రాగన్నగూడ వార్డు కార్యాలయంలో నిర్వహించిన పాలకమండలి సమావేశంలో ఈ నెల 1వ తేదీ నుంచి 9 వరకు నిర్వహించనున్న కార్యక్రమాలపై కమిషనర్, కౌన్సిలర్లతో ఆమె చర్చించారు. అనంతరం అనురాధ మాట్లాడుతూ.. ప్రజా మరుగుదొడ్లు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలు, ప్రభుత్వ కార్యాలయాలు, హెల్త్ క్యాంపు, నీటి వనరులను శుభ్రం చేయనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ, సాంస్కృతిక కార్యక్రమాలు, పారిశుద్ధ్య సిబ్బందికి సన్మానం చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కమిషనర్ అమరేందర్ రెడ్డి, వైస్ చైర్ పర్సన్ హరిత, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఉపాధి కల్పించాలి



ధర్నా చేస్తున్న డీఎస్పీ నాయకులు

ఆమనగల్లు: నిరుపేదలకు విద్య, వైద్యం, ఉపాధి కల్పించడంతో పాటు భూమి, ఇళ్లు కేటాయించాలని ధర్మ సమాజ్ పార్టీ కల్వకుర్తి ఇన్‌చార్జి రమేశ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం పార్టీ ఆధ్వర్యంలో నిరుపేదల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ లలితకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ నిరుపేదల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాష్ట్ర బడ్జెట్‌లో 25 శాతం నిధులు విద్యారంగానికి, 25 శాతం వైద్య రంగానికి, మరో 25 శాతం ఉపాధి రంగానికి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బలరాం, జగన్, హరి, ప్రవీణ్, యాదగిరి, మహేశ్, గోపాల్‌నాయక్, పరమేశ్వర్, శ్రీశైలం, శివ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

తలకొండపల్లి: ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి తహసీల్దార్ నాగార్జున, ఆర్ఐ మంజుల స్థలం పరిశీలించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధి ఖానాపూర్ శివారు ప్రాంతంలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 256లో పాఠశాల భవనాన్ని నిర్మించనున్నారు. ఈ మేరకు శనివారం అధికారులు స్థలాన్ని పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడారు. భూ సర్వే చేయించి హద్దులు, మ్యాపు తదితర వాటిని గుర్తించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



స్థలం పరిశీలిస్తున్న తహసీల్దార్ తదితరులు

ముగిసిన కులగణన

పూర్తికావచ్చిన ఆన్‌లైన్ ప్రక్రియ



గురునానక్ కాలేజీలో ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటమ్మ

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన ఇంటింటి సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) పూర్తయింది. ఆన్‌లైన్ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. నవంబర్ 9వ తేదీ నుంచి సర్వే మొదలు పెట్టిన సంగతి తెలిసిందే. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 7,920 ఇళ్లను ఎన్యుమరేటర్లు సర్వే చేశారు. వారు సేకరించిన డేటాను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నామని, ఆ ప్రక్రియ 99 శాతం పూర్తయిందని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర సాగర్ తెలిపారు. మున్సిపాలిటీలో గుర్తించిన నివాసాల్లో 642 కుటుంబాలు ఇతర ప్రాంతాల్లో సర్వే చేయించుకోగా.. 122 మంది సర్వేను వ్యతిరేకించారని, మరో 80 ఇళ్లకు తాళాలు వేసిఉన్నట్లు తెలిపారు.

14 గ్రామాల్లో..

ఇబ్రహీంపట్నం మండల పరిధి 14 గ్రామ పంచాయతీల్లో 11,151 కుటుంబాలను సర్వే చేశారు. సేకరించిన సమాచారం ఆన్‌లైన్ ప్రక్రియ గురునానక్ కళాశాలలో కొనసాగుతోంది. శనివారం సాయంత్రం వరకు 72 శాతం ప్రక్రియ పూర్తయిందని అధికారులు వెల్లడించారు.

రైతు పండుగ పేరుతో డ్రామా



రుణమాఫీ కాని రైతులతో నిరసన వ్యక్తంచేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు, రైతులు

- హామీలు పట్టించుకోని ప్రభుత్వం
- అసంపూర్తిగా రుణమాఫీ
- రైతుభరోసా ఇవ్వని కాంగ్రెస్
- బీఆర్‌ఎస్ నాయకుల ధ్వజం

కడ్తాల్: రైతు పండుగ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పబ్బం గడుపుకొంటుందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తుంది రైతు పండుగ కాదని, అసలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడమే దండగని విమర్శించారు. మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా.. ప్రజలను మభ్యపెట్టేందుకు చూస్తోందని పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో రుణమాఫీ కాని రైతులతో బీఆర్‌ఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దశరథ్ నాయక్ మాట్లాడుతూ.. రుణమాఫీ అసంపూర్తిగా మిగిలిందని, అర్హులందరికీ రాలేదని తెలిపారు. రెండు పంటలు పండించిన రైతుకు నేటికీ రైతుభరోసా ఇవ్వలేదని, పాడి రైతును పట్టించుకునే వారే కరువయ్యారని మండిపడ్డారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసిన తరువాతే.. రైతు పండుగ చేసుకోవాలని సూచించారు. బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ ఒక్క పిలుపు ఇస్తే.. లక్షలాది మంది రైతులు తరలివచ్చేవారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, సులోచన, భాగ్యమ్మ, జంగయ్య, బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు నర్సింహ, అశోక్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సింహగర్జనను విజయవంతం చేయండి

యాచారం: నగరంలో నేడు నిర్వహించనున్న మాలల సింహగర్జన సభను జయప్రదం చేయాలని నందివనపర్తి జై భీం ఎడ్యుకేటెడ్ యూత్ అధ్యక్షుడు వివేక్ పిలుపునిచ్చారు. శనివారం నందివనపర్తి గ్రామంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ దళితుల విచ్ఛిన్నానికి కుట్ర జరుగుతుందన్నారు. వర్గీకరణ జరిగితే.. నష్టపోతామని, మాలలు ఐక్యంగా పోరాడి దానిని అడ్డుకోవాలని సూచించారు. సభకు తరలి రావాలని కోరారు. యూత్ సభ్యులు యాదయ్య, నరేందర్, నర్సింహ, రాజు ఉన్నారు.

విద్యార్థుల సంక్షేమం మరిచిన ప్రభుత్వం

- కలుషిత ఆహారంతో ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..
- ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల ధ్వజం
- విద్యాసంస్థల బంద్ విజయవంతం
- నాణ్యమైన ఆహారం అందించాలని డిమాండ్



ఇబ్రహీంపట్నం: విద్యాసంస్థల బంద్‌లో ఎస్‌ఎఫ్‌ఐ నేతలు, విద్యార్థులు



కడ్తాల్: విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ నాయకులు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న చిన్నారుల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆరోపించారు. పాఠశాలలు, వసతిగృహాల్లో నిర్వాహకుల నిర్లక్ష్యం వలన విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని వాపోయారు. శుభ్రతలేని, ఉడికీఉడకని ఆహారం తినలేక పిల్లలు పస్తులు ఉంటున్నారని పేర్కొన్నారు. ప్రజా పాలన కొనసాగిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. బాలబాలికల ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోవడం లేదని విమర్శించారు. విద్యార్థుల సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం విద్యాసంస్థలను మూసివేయించారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు బోడ వంశీ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో వరుస ఫుడ్ పాయిజన్లకు కారణమౌతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనారోగ్యంతో ఆస్పత్రి పాలైన చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. నాణ్యతాప్రమాణాలు పాటించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించి, వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. మరుగుదొడ్లు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ నాయకులు భాను, ఎండీ సైఫ్, ఎండీ సలీం తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖకు మంత్రి కరువు

కడ్తాల్: విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, సర్కారు బడుల్లో చదివే చిన్నారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు సిద్ధూ, సీఐటీయూ నాయకులు పెంటయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు మండల కేంద్రంలో ప్రభుత్వ విద్యా సంస్థలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా.. ఇప్పటి వరకు విద్యాశాఖకు మంత్రి లేకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో వరుసగా ఫుడ్ పాయిజన్‌తో పిల్లలు ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కలుషిత ఆహారంతో ఆస్పత్రి పాలైన వారికి మెరుగైన వైద్యం అందించాలని, విచారణ అనంతరం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ నాయకులు వినోద్, ప్రశాంత్, రాఘవేందర్, చరణ్, అక్షయ్, వేణు, సందీప్ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

మంచాల: రాష్ట్రంలోని హాస్టళ్లలో తరచూ ఫుడ్ పాయిజన్ అవుతుందని ఎస్‌ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి తరంగ్ అన్నారు. దీంతో విద్యార్థులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు పాఠశాలలను బంద్ చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సర్కారు బడులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్యను వ్యాపారం చేసి, ప్రైవేటీ కరణను ప్రోత్సహిస్తుందని విమర్శించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రాకేష్, అభి, సందీప్, మనీ తదితరులు పాల్గొన్నారు.